క్లుప్తంగా

సేవ చేసే వారికి ప్రజల ఆదరణ



కైకలూరు: ప్రజలకు సేవ చేసే వారిని కైకలూరు నియోజకవర్గ ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన్ను కలిసి పోలింగ్ సరళిపై చర్చించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ డీఎన్నార్ మరో పర్యాయం కైకలూరు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయమన్నారు.

ఉపాధి హామీతో రైతులకు మేలు



మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు సాగునీటి సమస్యలు తీరుతున్నాయని ఎంపీడీఏ ఎస్.నవీన్ తెలిపారు. దెయ్యంపాడు గ్రామంలో రూ.2.60 లక్షలతో గురువారం 180 మంది ఉపాధి కూలీలు పంట కాలువ పనులను చేశారు. ఎంపీఏ మాట్లాడుతూ పంట కాలువలు, బోదెల మరమ్మతులతో పొలాలకు పుష్కలంగా నీరు చేరుతుందన్నారు. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెట్టు కూలి ట్రాఫిక్‌కు అంతరాయం

ముదినేపల్లిరూరల్ : బొమ్మినంపాడు శివారు జానకిగూడెం వద్ద గురువారం ఉదయం వీచిన పెనుగాలులకు చెట్టు రోడ్డుకు అడ్డంగా పడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకట్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో కూలిన చెట్టును తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న ఎస్‌ఐను పలువురు అభినందించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

పామర్రు: పామర్రు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద గురువారం మజ్జిగ పంపిణీ చలివేంద్రం నిర్వహించారు. స్థానిక లయన్స్ క్లబ్ సభ్యుడు తోట రమేష్ సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో చల్లని మజ్జిగ బాటసారులకు,ప్రయాణీకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్ అన్నారు. మజ్జిగ చలివేంద్రాన్ని లయన్స్ క్లబ్ సభ్యులు అందరూ కొనసాగించేలా చూడాలని కోరారు. క్లబ్ సభ్యులు కె.చంద్రశేఖర్ రావు, బైసాని నాగేశ్వరరావు, లంకపల్లి శ్రీనివాస రావు, బి.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

గుడివాడటౌన్: సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం గురువారం గుడివాడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీపీఎం కార్యాలయం ఎదుట సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణ రావు పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి.రజిని, వృత్తి సంఘం జిల్లా కన్వీనర్ సీహెచ్ శివ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్.కొండ, బి.అరుణ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనుల పురోగతిపై సమీక్ష

కైకలూరు: మండలంలో జరుగుతున్న నాడు - నేడు ఫేజ్ - 2 పాఠశాలల పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈవో వి.శ్రీనివాసరావు తెలిపారు. కైకలూరు విద్యాశాఖ కార్యాలయంలో నాడు - నేడు పనుల పురోగతిపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ ఏఈ సాదిక్ పాషా, సచివాలయ ఉద్యోగులు, ఇంజినీర్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, సచివాలయ, పీఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కలిదిండి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో పి.ప్రభాకర్‌రావు సూచించారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో వంట ఏజెన్సీ నిర్వాహకులకు జగనన్న గోరుముద్ద పథకంపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని, ఆ రోజు నుంచే తప్పనిసరిగా మెనూ పాటించాలన్నారు. రుచి, శుచి, శుభ్రత పాటించాలన్నారు.

ఆర్థిక సాయం

ముదినేపల్లిరూరల్ : అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వైద్య విద్యార్థిని గురువారం ఆర్థిక సాయం అందజేసింది. ముదినేపల్లికి చెందిన ముఠా కూలీ కలగంటి సాంబశివరావు (35) ఊపిరితిత్తుల వ్యాధితో చికిత్స పొందుతూ మరణించాడు. స్థానిక వైద్యుడు మనోజ్ కుమార్తె, వైద్య విద్యార్థిని వైష్ణవి మృతుడి భార్యకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేసింది.

ముగిసిన కరాటే శిక్షణ

కైకలూరు: స్థానిక జపాన్ షోటోఖన్ కరాటే డూ నేషనల్ అకాడమీ మాస్టర్ సన్సయ్ డాక్టర్ విస్సంశెట్టి ఉదయ భాస్కర్ ఉచిత కరాటే శిక్షణ గురువారం ముగిసింది. మొత్తం 35 మందికి ధ్రువపత్రాలను అందించారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం!

- 59,550 ఎకరాల్లో సాగుకు సమాయత్తం
- 1030 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాల సరఫరాకు ప్రణాళిక
- 330 క్వింటాళ్ల పచ్చిరొట్ట, జనుము, పిల్లిపెసర విత్తనాలు సరఫరా
- రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల సరఫరాకు చర్యలు



మొదటి దశ దుక్కి దున్ని సిద్ధం చేసిన పొలాలు

గుడివాడరూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నియోజకవర్గంలో సాగు కోసం వ్యవసాయాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో అడపాదడపా తేలికపాటి వర్షాలు పడుతుండటంతో రైతులు ఇప్పటికే మొదటి దశలో దుక్కులు దున్ని పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు 59,550 ఎకరాల్లో సాగుకు రైతులు సిద్ధమవుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఆయా రైతుల కోసం ప్రభుత్వం నుంచి సుమారు 1030 క్వింటాళ్లు వరి(మూడు రకాల) విత్తనాలను సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. వీటితో పాటు భూమిని సారవంతం చేసే వివిధ రకాల పచ్చిరొట్ట, జనుము, పిల్లిపెసర విత్తనాలను సుమారు 330 క్వింటాళ్లు అందుబాటులోకి తీసుకువచ్చి సబ్సిడీపై రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఉపయోగకరంగా ఉండటంతో, ఈ ఏడాది సైతం ఆయా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా చేసేందుకు పూర్తి ఏర్పాట్లు చేశారు.

మండలాల వారీగా సాగు, విత్తనాలు పంపిణీ లక్ష్యం

మండలం	ఖరీఫ్ సాగు (ఎకరాల్లో)	విత్తనాలు పంపిణీ (క్వింటాళ్లలో)
గుడివాడ	14,900	300
నందివాడ	4150	30
పెదపారుపూడి	18000	300
గుడ్లవల్లేరు	22500	400

విత్తనాల కోసం ప్రణాళిక

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో సుమారు 59,550 ఎకరాల్లో సాగుకు సమాయత్తమవుతున్నట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనాలు తయారు చేశారు. ఆయా సాగుకు సంబంధించి మొదటి దశ ఎంటీయూ 1061, ఎంటీయూ 1318, బీపీటీ 5204 తదితర రకాల వరి విత్తనాలు సుమారు 1030 క్వింటాళ్లు సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

ప్రణాళిక సిద్ధం



ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి వ్యవసాయశాఖ అన్ని ప్రణాళికలు సిద్ధం చేసింది. రైతులకు అవసరమైన వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలను రైతుభరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించారు. వారి ఆదేశాలతో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా విత్తనాలను అందజేసేందుకు అన్ని చర్యలు చేపట్టాం. ఎక్కడైనా ఏమైనా ఇబ్బందులు ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కరిస్తాం.

–నిమ్మగడ్డ రమాదేవి, వ్యవసాయశాఖ ఏడీఏ

స్వాతంత్ర్యయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



జమీగొల్వేపల్లిలో జాతీయ నాయకుల చరిత్రలు, జాతీయ జెండాలతో విద్యార్థులు, స్థానికులు



మండవల్లి గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు



గుడివాడలో విద్యార్థులకు శ్లోకాలు వివరిస్తున్న అవిర్నేని వెంకటేశ్వరరావు

జమీగొల్వేపల్లి(పామర్రు): నేటి యువత స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని యోగా గురువు పొట్లూరి ధర్మారావు, మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులలో భాగంగా గురువారం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ స్ఫూర్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి మన స్వాతంత్ర్యానికి ఎందరో మహానుభావుల త్యాగాలే కారణమని, ఆటువంటి మహనీయుల జీవిత చరిత్రలను ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచి చదివి వాటి నుంచి స్ఫూర్తి పొందాలని అన్నారు. ప్రతి విద్యార్థి వారి అడుగు జాడలలో నడుస్తూ దేశభక్తి, జాతీయ భావనను కలిగి ఉండాలని అన్నారు. అప్పుడే వారి త్యాగాలకు నిజమైన నివాళి ఇచ్చినట్లు అవుతుందని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు సీహెచ్ కృష్ణ మోహన్, సీహెచ్ రామారావు, ఎంపీ రత్నం, ఉపాధ్యాయులు దీవి వంశీ కృష్ణ, గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామర్రులో ..

గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా శాఖా గ్రంథాలయంలో చిన్నారులతో మ్యూజికల్ చైర్ ఆట ఆడించినట్టు గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి చెప్పారు. అనంతరం చిన్నారులతో పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతికథల బోధన

ముదినేపల్లిరూరల్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు నీతి కథలు బోధించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి విద్యార్థులతో నీతి కథల పుస్తకాలను పఠనం చేయించారు. సీనియర్ విద్యార్థులతో కథలను చెప్పించారు. అనంతరం విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ నిర్వహించి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు.

మండవల్లిలో...

మండవల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయాధికారి షేక్ పర్వీనా అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం స్థానిక గ్రంథాలయంలో పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వీనా మాట్లాడుతూ పిల్లలు పుస్తక పఠనం అలవరుచుకోవాలని, వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుడివాడలో...

గుడివాడటౌన్: వేసవి శిక్షణ తరగతులలో భాగంగా స్థానిక రాజేంద్రనగర్ శాఖా గ్రంథాలయంలో గురువారం సాహితీ స్రవంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు సాహిత్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత సరస్వతీ దేవి, ఘంటసాల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శిక్షణలో భాగంగా సరస్వతీదేవి శ్లోకాలను విద్యార్థులకు బోధించారు. అవిర్నేని వెంకటేశ్వరరావు చాణక్య ఏకపాత్రాభినయం చేసి చిన్నారులను మంత్ర ముగ్ధులను చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.శాంతి, సాహితీ స్రవంతి తరఫున లంకా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో నీతికథలు బోధిస్తున్న విద్యార్థి

విద్యార్థులకు పఠన పోటీలు

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు ఆట పాటలతో పాటు పుస్తక పఠన పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి పాల్గొన్నారు.

గీత దాటితే కఠిన చర్యలు

పామర్రు: ఎన్నికలలో గెలుపు ఓటములు సహజమని, హద్దు మీరి ఎవరైనా గీత దాటితే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ స్పష్టం చేశారు. స్థానిక గుడివాడ రోడ్డులో ఉన్న శ్రీనివాసా రెసిడెన్సీలో పామర్రు, మొవ్వ, పెదపారుపూడి మండల పరిధిలోని పలు పార్టీల నాయకులు కార్యకర్తలకు గురువారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు తర్వాత గెలిచిన అభ్యర్థులు వారి అనుచరులతో విజయోత్సవ ర్యాలీలు, డీజేలతో సంబరాలు నిర్వహించరాదని తేల్చి చెప్పారు. ఆందోళనలు నిర్వహిస్తే బాష్పవాయువు, వాటర్‌కెనాన్, గాల్లోకి కాల్పులు, లాఠీచార్జీ, ఫైరింగ్ వంటి వాటిపై జిల్లా స్థాయిలో ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా సిబ్బందికి శిక్షణ ఇచ్చామని చెప్పారు. శాంతి కమిటీల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలతో అత్యవసర సమావేశం నిర్వహించి వారంతా తమకు సహకరించాలని కోరామన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత నియోజకవర్గంలో వాట్సాప్, ఇతర సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే మెసేజ్‌లు పోస్టు చేయడం, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినా, ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీసేసి పెద్ద పెద్ద శబ్దం చేస్తూ వాహనాలు నడిపినా, హింసాత్మక చర్యలు, విధ్వంసాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పామర్రు, మొవ్వ, పెదపారుపూడి ఎస్‌ఐలు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, టి.శ్రీనివాస్, జి.రాజు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలి

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జూన్ 4న గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏలూరు డీఎస్పీ ఇ.శ్రీనివాసులు అన్నారు. కైకలూరు సర్కిల్ కార్యాలయంలో రూరల్ సీఐ బి.కృష్ణకుమార్, టౌన్ సీఐ ఆకుల రఘులతో కలిసి గురువారం శాంతి భద్రతల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే గ్రామాలను ముందుగానే గుర్తించి, గొడవలు జరగకుండా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు కె.రామకృష్ణ, ఎంఆర్‌కె.రాజు, డి.వెంకటకుమార్, సీహెచ్ రామచంద్రరావు, ఎస్.ప్రియకుమార్ పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నేతలు, శాంతి కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్

సమస్యాత్మక ప్రాంతాలలో ముమ్మర తనిఖీలు

పమిడిముక్కల: సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగే అల్లర్లు, గొడవలు దృష్టిలో పెట్టుకొని మండలంలో సమస్యాత్మక గ్రామాలు, అనుమానిత ప్రదేశాల్లో పమిడిముక్కల సర్కిల్ పోలీసులు కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తోట్లవల్లూరు ఎస్‌ఐ విశ్వనాథ్, పమిడిముక్కల సర్కిల్ పోలీస్ సిబ్బందితో కలిసి సమస్యాత్మక గ్రామమైన మంటాడ రెడ్డిపాలెంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ కిషోర్ బాబు, ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డిపాలెం ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిని వివరించారు. గ్రామాలలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినా, పేలుడు పదార్థాలు, మారణాయుధాలు అక్రమంగా నిల్వ ఉంచినా వారి సమాచారం తమకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు


కైకలూరు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని రూరల్ ఎస్‌ఐ టి.రామకృష్ణ హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామమైన శృంగవరప్పాడులో గురువారం ప్రజలతో సమావేశం నిర్వహించారు. గతంలో కేసులు నమోదు చేసిన వారిపై ముందస్తుగానే బైండోవర్‌లు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాల కార్మికులను చేర్చుకుంటే కఠిన చర్యలు



గుడివాడటౌన్: వ్యాపారులు, వర్తకులు, హోటల్ యజమానులు, ఇతర సంస్థల్లో ఎవరైనా బాల కార్మికులను విధుల్లో చేర్చుకుంటే కఠిన చర్యలు ఉంటాయని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వి.చక్రధర్ హెచ్చరించారు. స్థానిక పాటిమీద గల సహాయ కార్మిక అధికారి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు చిన్నారులతో పనులు చేయించడం నేరమన్నారు. జూన్ మొదటి వారం నుంచి ఆకస్మిక తనిఖీలు ప్రారంభిస్తున్నామని, ఎక్కడైనా బాల కార్మికులను పనిలో పెట్టుకుని ఉంటే తక్షణమే వారిని పని నుంచి తొలగించాలని చెప్పారు. తనిఖీలలో ఎవరైనా పట్టుబడితే ఆ సంస్థ యజమానికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షలు జరిమానా, రెండేళ్ల జైలుశిక్ష విధిస్తారని తెలిపారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు పౌష్టికాహారంపై శిక్షణ



వంటల పోటీలో విజేతలకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంఈవో

పమిడిముక్కల: స్థానిక ఎంఆర్‌సీలో గురువారం మధ్యాహ్న భోజన కార్మికులకు పౌష్టికాహారంపై ఎంఈవో శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచికరంగా తయారు చేయాలని సూచించారు. ఆహార పదార్థాలు తయారు చేసేటప్పుడు పరిశుభ్రతను పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే సమయంలో నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వంటల పోటీలు నిర్వహించి ఆహార పదార్థాలు రుచికరంగా తయారు చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కుక్‌లు, హెల్పర్లు పాల్గొన్నారు.

దళిత హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా బుల్లా

గుడ్లవల్లేరు: దళిత హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా బుల్లా త్యాగరాజు(కింగ్)ను నియమించారు. ఈ విషయాన్ని ఆయన గురువారం విలేకరులకు తెలిపారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో తనకు నియామక పత్రాన్ని కమిటీ చైర్మన్ బి.రాజారావు అందించారన్నారు.

కృష్ణా కరకట్ట వెంబడి చెట్ల నరికివేత

కరకట్ట బలహీనపడుతుందని వాహనదారుల ఆందోళన

పమిడిముక్కల: చెట్లను పెంచండి. పర్యావరణాన్ని పరిరక్షించండి అని ఒకవైపు చెబుతుంటే, మరో వైపు పచ్చని చెట్లను నరికేసి సొమ్ము చేసుకొంటున్న ఘటన మండల పరిధిలోని లంకపల్లి వద్ద జరిగింది. విజయవాడ నుంచి అవనిగడ్డకు వెళ్లే కృష్ణా కరకట్ట రహదారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. కరకట్టకు ఇరువైపులా పచ్చని చెట్లు ఉన్నాయి. ఈ చెట్లు కరకట్టకు రక్షణ గోడగా ఉంటాయి. చెట్లను యథేచ్ఛగా కొట్టేయడం వల్ల కరకట్ట బలహీన పడే ప్రమాదముందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని లంకపల్లి వద్ద రహదారికి ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లను కొట్టేసి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సొమ్ము చేసుకొంటున్నాడు. సుమారు 25 నుంచి 30 చెట్లను కొట్టేసి ఒక లోడ్ అమ్ముకున్నాడని, మరో లోడ్ సిద్ధం చేస్తున్నాడని గ్రామస్తులు ఆర్‌సీ ఏఈ పులి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు.



లంకపల్లిలో కరకట్ట వెంబడి నరికి పడవేసిన చెట్లు

ఏఈ ఆర్‌సీ సిబ్బందిని పరిశీలించి రిపోర్ట్ ఇవ్వమని ఆదేశించారు. ఆర్‌సీ సిబ్బంది రహమతుల్లా సంఘటనా స్థలానికి వెళ్లి నరికేసిన చెట్లను పరిశీలించి, స్థానికులను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఆర్‌సీ సిబ్బందిని పంపి విచారణ చేయించానని, ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు ఏఈ పులి శ్రీనివాస్ తెలియజేశారు.

ఘనంగా హనుమజ్జయంతి ఉత్సవాలు

తోట్లవల్లూరు: హనుమజ్జయంతి మహోత్సవాలు మండలంలోని యాకమూరులో ఘనంగా జరుగుతున్నాయి. హనుమజ్జయంతిని పురస్కరించుకుని స్థానిక శ్రీసువర్చలా సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి గత రెండు రోజులుగా విశేషపూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితుల ఆధ్వర్యాన గురువారం శ్రీలక్ష్మీ గణపతి హోమం, మృత్యుంజయ హోమం, రుద్ర హోమం, పాశుపత మహా మంత్ర హోమాలు జరిగాయి. జూన్ 1న సువర్చలా సమేత అభయాంజనేయస్వామి శాంతి కల్యాణం జరగనుంది. ఆయా కార్యక్రమాలలో భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు జరుపుతున్నారు.

గుడివాడలో...

గుడివాడటౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమాన్ జయంత్యుత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభించారు. వేకువ జామునే స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు యడవల్లి విజయ భాస్కర్ మాట్లాడుతూ స్వామి వారి జయంత్యుత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించాలని ఆలయ పాలక వర్గం నిర్ణయించిందని, అందులో భాగంగా గురువారం స్వామి వారికి అభిషేకాలు, సాయంత్రం కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం స్వామి వారికి తమలపాకులతో అర్చన చేస్తామన్నారు. శనివారం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



యాకమూరులో భక్తులతో పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

ఘనంగా సాయిబాబా ఆలయ 30వ వార్షికోత్సవం

లక్ష మల్లెలతో విశేష అలంకారంలో బాబా

పామర్రు: స్థానిక సాయినగర్‌లో ఉన్న శ్రీ షిర్డి సాయిబాబా మందిరం 30వ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున స్వామివారికి కాగడ హారతితో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం పంచామృతాలతో, నవరసాలతో, సుగంధ ద్రవ్యాలతో బాబా వారికి విశేషంగా అభిషేకాలను చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో సామూహికంగా బాబాకు మల్లెల పూజ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పూజ చేసిన మల్లెలను స్వామికి సమర్పించి లక్ష మల్లెలతో స్వామిని వైభవంగా అలంకరించారు. మధ్యాహ్న హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయంలో పూజాదికాలను ఆలయ అర్చకుడు పావులూరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త తమ్మా వినోద్‌రెడ్డి దంపతులు తెలిపారు. కార్యక్రమంలో భక్త మండలి సభ్యులు పి.కాశీ, రమేష్, మల్లికార్జునరావు, సాంబశివరావు, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు బీమా పథకం

గుడివాడటౌన్: ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పేద కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ కిషోర్ అన్నారు. స్థానిక ఫ్రూట్ హాకర్స్ కార్యాలయంలో గురువారం చిన్నకారు డ్రైవర్‌లు, ఫ్రూట్ హాకర్స్‌కు బీమా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రూట్ మర్చంట్స్, హాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోకరకొండ బలరామ్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఏటా ఈ బీమా పాలసీ కొనసాగిస్తున్నారన్నారు. 50 మంది టాక్సీ డ్రైవర్‌లు, 200 మంది హాకర్లకు బీమా ప్రీమియం మొత్తం రూ.1 లక్ష 12 వేల 500 చెల్లించినట్లు ఆయన వివరించారు. కార్మికుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ప్రతి ఏటా ఈ బీమా మొత్తాలను బలరామ్ చెల్లించడం అభినందనీయం అన్నారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నెరుసు చింతయ్య, పంద్రాజు సాంబశివరావు, పండ్ల వర్తక సంఘం నాయకుడు పెద్ది రమణ, పెద్ది కిషోర్, అప్పన్న, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.



పోస్టల్ అధికారులతో హాకర్స్ అసోసియేషన్ నాయకులు

ముగిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

పెదసనగల్లు(మొవ్వ): మొవ్వ మండలం పెదసనగల్లు గ్రామంలో గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్న శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. వేకువజామున సుప్రభాత సేవతో ప్రారంభమైన వేడుకలు నిత్యార్చన, నిత్య హోమం, బలిహరణ, వసంతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, ధ్వజ అవరోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుడివాడటౌన్: రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులలో భాగంగా విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా గురువారం పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పి.భాను ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు సత్యన్నారాయణ పురం, ఇండోర్ స్టేడియం, కాకర్ల వీధి, గుడ్‌మెన్ పేట, గీతా భవన్ రోడ్, పంతులుగారి షెడ్ ఏరియా, నవతా ట్రాన్స్‌పోర్టు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు.